

ఇంగ్లండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేటీఆర్. చిత్రంలో పీడీఎస్ఎల్ సంస్థ డైరెక్టర్ క్రాంతి పుప్పాల, ఇతర ప్రతినిధులు



డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పల్లా

## చరిత్రాత్మక సభల ఘనత బీఆర్ఎస్‌దే

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

చేర్యాల/ జనగామ, మే 31 (నమస్తే తెలంగాణ): 'బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మొట్టమొదటి కరీంనగర్ శంఖారావం.. వరంగల్ ప్రగతి నివేదన.. ఎల్కతుర్తి రజతోత్సవ సభలకు ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయడంతో బీఆర్ఎస్ సభలు దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచాయి..' అని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా జూన్ 1న జరిగే ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసేందుకు శనివారం అమెరికాలోని డాలస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో నిర్వహించిన మొదటి సభ సమయంలో అసలు జనం వస్తరా? రారా? అని కొందరు నాయకులు కేసీఆర్‌తో అంటే మీరు అన్ని ఏర్పాట్లు చేయండి.. జనం వస్తరు.. అని కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి కెప్టెన్ లక్ష్మీకాంతారావుతో అన్నారని గుర్తుచేశారు. ఊహించనంత భారీగా ప్రజలు వచ్చి విజయవంతం చేయడం ద్వారా కరీంనగర్ శంఖారావం దేశ చరిత్రలో అతిపెద్ద సభగా నిలిచిందని పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభ ద్వారా తెలంగాణ ప్రజలకు ఏం పోగొట్టుకున్నరో తెలిసింది.. మళ్లీ కేసీఆర్, బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నరు.. ఆ నమ్మకంతో నిర్వహించేదే డాలస్ సభ అని తెలిపారు.

## పేరుకే 'స్పెషల్'.. వేతనాల్లేవ్

**శానిటేషన్ వర్కర్లకు మొండిచేయి**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): వాళ్లు సర్కారు బడుల్లో పనిచేశారు. స్కూళ్లను ఊడ్చి, కడిగి, శుభ్రం చేశారు. ఆఖరికి మూత్రశాలలు, మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా మార్చారు. మొక్కలకు నీళ్లు పోసి, కంటికి రెప్పలా పెంచారు. అలా ఏకంగా 10 నెలల పాటు పనిచేశారు. అయినా ఆ స్పెషల్ వర్కర్లకు వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. చాలా జిల్లాల్లో నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెట్టారు. పనిచేయించుకుని, వేతనాలు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు. కొన్ని జిల్లాల్లో అరకొర నిధులనే విడుదల చేశారు.

### కలెక్టర్ల నిర్లక్ష్యం వల్లే

సర్కారు బడుల్లో పారిశుద్ధ్య బాధ్యతలను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. స్పెషల్ వర్కర్లను నియమించుకునేందుకు అవకాశం కల్పిస్తూ జీవోను జారీచేసింది. వారికి వేతనాలు చెల్లించేందుకు స్కూల్ ఫెసిలిటీ, మెయింటెనెన్స్ గ్రాంట్‌ను ఇస్తామని ప్రకటించింది. విద్యార్థుల సంఖ్య 1-30లోపు ఉంటే రూ.3 వేలు, 31-100లోపు ఉంటే రూ.6 వేలు, 101-250లోపు ఉంటే రూ.8 వేలు, 750 మంది విద్యార్థులు దాటితే రూ.20 వేలు ఇస్తామని స్పష్టం చేసింది. డిస్ట్రిక్ట్ మినరల్ ట్రస్ట్ ఫండ్ (డీఎంఎఫ్‌టీ) నిధుల నుంచి స్పెషల్ వర్కర్స్‌కు వేతనాలు ఇవ్వాలని ఆదేశించింది. దీంతో 2023 ఆగస్టు నుంచి అన్ని పాఠశాలల్లో స్పెషల్ వర్కర్లను నియమించుకున్నారు. వారి వేతన నిధులను విడుదల చేసే బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. కానీ, ఈ నిధుల విడుదలలో కలెక్టర్లు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదు. ములుగు జిల్లాలో ఒక నెల నిధులను మాత్రమే విడుదల చేశారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జనగామ, సూర్యాపేట, వికారాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 3 నెలలకు సంబంధించిన నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మంచిర్యాల జిల్లాలో 5 నెలలు, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాల్లో 6, జోగులాంబ గద్వాల జిల్లాలో 8, నాగర్‌కర్నూల్ జిల్లాలో 9 నెలల నిధులు మాత్రమే విడుదల చేశారు.

# ఇండియా ఫస్ట్.. తెలంగాణ ఫస్ట్

మొదటిపేజీ తరువాయి...

సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విజయాల గురించి మాట్లాడటం ఎల్లప్పుడూ తనకు గర్వకారణంగా ఉంటుందని చెప్పారు. ఆటోమొబైల్ రంగంలో పీడీఎస్ఎల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరారు. ఇంగ్లండ్‌లో వర్సిటీ, ఇండస్ట్రీల మధ్య ఉన్న పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందని తెలిపారు. మెక్ లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ.. వార్విక్ వర్సిటీలో తన నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించుకోవడం తెలంగాణ టాలెంట్‌కు నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఆటోమోటివ్ హబ్‌గా పుణె, చెన్నైల సరసన హైదరాబాద్ నిలిచిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందని తెలిపారు. ఆటోమోటివ్ రంగంలో కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కే పరిమితం కాకుండా తయారీ రంగంలోనూ తెలంగాణను నంబర్‌వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తెచ్చిన పాలసీలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

### అంతర్జాతీయ కంపెనీలకు తెలంగాణ చిరునామా

భారతదేశంలో ఫార్ములా ఈ-రేసింగ్ చాంపియన్ షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని కేటీఆర్ చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడం, తెలంగాణలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు తెలంగాణ కొత్త చిరునామాగా మారిందని తెలిపారు. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కార్పొరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో గడిచిన పదేండ్లలో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేండ్ల పాలనలో ఐటీ ఉద్యోగాలు, ఎగుమతులతోపాటు ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందని చెప్పారు.



ఇంగ్లండ్‌లో పీడీఎస్ఎల్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న కేటీఆర్

### కేటీఆర్ గ్లోబల్ లీడర్: పీడీఎస్ఎల్ డైరెక్టర్

వినూత్న ఆలోచనలు, పనితీరుతో కేటీఆర్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాకుండా గ్లోబల్ లీడర్‌గా ఎదిగారని పీడీఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల చెప్పారు. కేటీఆర్ చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషితో ఐటీ ఒక్కటే కాకుండా అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. అనేక దిగ్గజ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించి తన పనితీరు, ఆలోచనా దృక్పథంతో గ్లోబల్ లీడర్‌గా ఎదిగిన కేటీఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం కంపెనీకి అత్యంత గర్వకారణమని చెప్పారు. నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ కార్యకలాపాలను కేటీఆర్ పరిశీలించారు. తమ సంస్థ గురించి పీడీఎస్ఎల్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఆ తరువాత కంపెనీ సిబ్బంది, ఉద్యోగులతో కేటీఆర్ ఇంటరాక్ట్ అయ్యారు.

> ఐటీ, అనుబంధ రంగాలు, ఆటోమొబైల్ వంటి ఇతర రంగాల్లో మన దేశ యువత ప్రతిభ, నిబద్ధతతో అద్భుతంగా రాణిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత, విద్యార్థులు, కంపెనీలు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి.
>
> -కేటీఆర్

## అమెరికా నలుమూలల నుంచి తరలిరావాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

దేవరుప్పుల, మే 31: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లయిన సందర్భంగా జూన్ 1న అమెరికాలోని డాలస్‌లో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ నిర్వహిస్తున్న రజతోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి తెలంగాణ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. అమెరికాలోని డాలస్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ యూత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ సభకు దీటుగా డాలస్ సభ ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఖ్యాతి ఖండాంతరాలు దాటగా ఆనాటి ఉద్యమంలో అమెరికా ఎన్నారైలు పాల్గొని కీలక భూమిక పోషించారని చెప్పారు. మూడోసారి కేసీఆర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి పప్పులో కాలేశారని ఇక్కడి ఎన్నారైలు చెప్పారని పేర్కొన్నారు.



డాలస్‌లో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లిని సన్మానిస్తున్న ఎన్నారైలు





అమెరికాలోని డాలస్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఫ్రిస్కోలో జరిగిన సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు, ఎన్నారైలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఎన్నారై సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, పైలట్ రోహిత్‌రెడ్డి, క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నేత బాలమల్లు తదితరులు పాల్గొన్నారు

# నేడు డాలస్‌లో తెలంగాణ సంబురం

- బీఆర్ఎస్ రజతోత్సవాలకు ముస్తాబు
- పెప్పర్ ఎరినా ప్రాంగణం గులాబీమయం
- అమెరికా అంతటా తెలంగాణ గుబాళింపు
- ఉట్టిపడుతున్న సంస్కృతి, సంప్రదాయాలు
- డాలస్‌కు బయలుదేరిన కేటీఆర్

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు అమెరికా అంతా సిద్ధమైంది. భారీ సభకు ఆ దేశంలోని డాలస్ నగరం ముస్తాబైంది. వైదికైన అక్కడి డాక్టర్ పెప్పర్ ఎరినా ప్రాంగణం గులాబీమయమైంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఒకవైపు బీఆర్ఎస్ రజతోత్సవాలు, మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సంబురంగా జరుపుకోనున్నారు. ఆయా వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు లండన్‌లో పర్యటించిన అనంతరం ఆయన శనివారం రాత్రే డాలస్ నగరానికి బయలుదేరారు. బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని వివిధ నగరాల నుంచి తెలంగాణవాదులు ఇప్పటికే డాలస్ చేరుకున్నారు. గత 10 రోజులుగా బీఆర్ఎస్ ఎన్నారై యూఎస్ఏ చైర్మన్ మహేశ్ తన్నీరు, ఎన్నారై సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల సహా యూఎస్ఏలోని ఎన్నారై విభాగానికితోడు పార్టీ ముఖ్యనాయకులు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల సందర్భంగా తెలంగాణవాదులు ప్రదర్శించిన ఉత్సాహం, ఆసక్తి డాక్టర్ పెప్పర్ ఎరినా సాక్షిగా తొణికిసలాడుతున్నది.

### యూఎస్ఏలో అన్ని ప్రాంతాల నుంచి రాక

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాదులు డాలస్ నగరానికి చేరుకుంటున్నారు. న్యూజెర్సీ, డెలావేర్, హోస్టన్, టెక్సాస్, కొలంబస్, ఆస్టిన్, ఫ్లోరిడా, శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్, అష్బుర్మ్, చికాగో, కెంటకీ తదితర నగరాల నుంచి తెలంగాణవాదులు పెద్ద ఎత్తున డాలస్ చేరుకున్నారు. వీరితోపాటు బ్రిటన్, కెనడా, గల్ఫ్ తదితర దేశాల నుంచీ సైతం బీఆర్ఎస్ ఎన్నారై సెల్ ప్రతినిధులు తరలిరానున్నారు. బీఆర్ఎస్ ఎన్నారై విభాగంతోపాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎన్నారైలు, తానా, ఆటా సంస్థల ప్రతినిధులు వేడుకలకు హాజరయ్యేందుకు ఇప్పటికే సంసిద్ధతను ప్రకటించారు. ఈ నేపథ్యంలో సభకు ఏ రాజకీయ పార్టీతో సంబంధంలేని తెలుగువాళ్లు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. ఆహ్వానితులకు, వేడుకల్లో భాగస్వాములకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగే ఎరినా ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు, ఎన్నారైలు. చిత్రంలో కొప్పుల ఈశ్వర్, మహేశ్ బిగాల తదితరులు


### ఎల్కతుర్తి స్ఫూర్తితో డాలస్ సభ

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన రజోత్సవ సభ స్ఫూర్తితో డాలస్ సభ నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్, బీఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు తెలిపారు. శనివారం డాక్టర్ పెప్పర్ ఎరినా వేదిక ఏర్పాట్లను మాజీ మంత్రులు, పార్టీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దేవిరెడి సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, గువ్వల బాలరాజు, చంటి కాంతికిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, నోముల భగత్, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదారి బాలమల్లు, నాయకులు జాన్సన్ నాయక్, మూల విజయారెడ్డి, ముఠా జయసింహ, నంద్యాల దయాకర్, రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బృందంతోపాటు అమెరికా కళాకారులతో డాలస్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే రీతిలో కళాప్రదర్శనలు నిర్వహించనున్నారు.

### మళ్లీ రగిలిన ఉద్యమస్ఫూర్తి

యూఎస్ఏలోని వివిధ రాష్ట్రాలు, నగరాల్లో మరోసారి తెలంగాణ ఉద్యమస్ఫూర్తి తొణికిసలాడుతున్నది. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌తో మమేకమై ప్రత్యేక రాష్ట్రం కోసం యూఎస్ఏలోని ఆయా ప్రాంతాల్లో పోరాటాల సందర్భంగా నెలకొన్న వాతావరణం పునరావిష్కరణ అవుతున్నది. 2001 నుంచి 2014 దాకా కేసీఆర్ నాయకత్వంలో ఎన్నారైలు తమ స్థాయిల్లో పోరాటంలో భాగస్వాములయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఇక్కడ జరుగుతున్న పోరాటాలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నారైలు ఉద్యమించారు. నాడు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై యూఎస్ఏలో బీఆర్ఎస్ ఎన్నారైలు టీడీఎఫ్ ప్రతినిధులతో కలిసి అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు అమెరికాలో పర్యటించిన సందర్భంలో తెలంగాణవాదులు తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తంచేశారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో పాల్గొనేందుకు యూఎస్ వచ్చిన నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా పలువురిని నిలదీసిన సందర్భాన్ని తెలంగాణ ఎన్నారైలు డాలస్ సభ నేపథ్యంగా గుర్తుచేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పురోభివృద్ధికి పడిన అడుగులు, పదేండ్లు తెలంగాణ సాధించిన ప్రగతిని ఎన్నారైలు నెమరువేసుకుంటున్నారు. అదే సమయంలో ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న పరిస్థితులు, కాంగ్రెస్ పాలనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అదే స్థాయిలో చర్చించుకోవడం గమనార్హం. తెలంగాణలో దురదృష్టవశాత్తు మళ్లీ ఉమ్మడిపాలన నాటి దుర్భర పరిస్థితులు ఉత్పన్నం అవుతున్నాయన్న భావన ఎన్నారైల్లో కనిపిస్తున్నది.

## లోకం పోకడ





## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| వరంగల్ | 39.0°c | 27.0°c |
| ఖమ్మం | 39.0°c | 28.0°c |
| నల్లగొండ | 38.0°c | 23.8°c |
| మెదక్ | 37.9°c | 26.8°c |
| ఆదిలాబాద్ | 37.8°c | 21.5°c |
| మహబూబ్‌నగర్ | 37.0°c | 25.0°c |
| కరీంనగర్ | 36.0°c | 27.0°c |
| రంగారెడ్డి | 35.6°c | 22.3°c |
| నిజామాబాద్ | 35.1°c | 25.4°c |
| హైదరాబాద్ | 35.2°c | 24.6°c |

### వారంపాటు తేలికపాటి వర్షాలు



హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం రాష్ట్రంలోని భద్రాద్రి-కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. రానున్న 48గంటల్లో హైదరాబాద్‌లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది.

## మళ్లీ మందు బాదుడు?

మొదటిపేజీ తరువాయి...

డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం టీజీబీసీఎల్ చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 30 శాతం అదనంగా పెంచాలని పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మాజీ న్యాయమూర్తి జస్టిస్ జైస్వాల్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ధరల నిర్ణయ కమిటీని (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నియమించిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ అధ్యయనం చేసి, డిస్టిలరీలకు ఇప్పుడిస్తున్న బేసిక్ ధరల మీద కనీసం 15శాతం వరకు అదనపు చెల్లింపులు చేయవచ్చని సూచించినట్టు సమాచారం. ప్రభుత్వం ఈ నెల 18న చీప్ లిక్కర్ బ్రాండ్లు మిగిలిన అన్ని కేటగిరీల మద్యం మీద 7.7శాతం నుంచి 9.9 శాతం ప్రత్యేక ఎక్సైజ్ సెస్ విధించిన సంగతి తెలిసిందే. ఈ సెస్‌తో రాష్ట్ర ఖజానాకు ఏడాదికి రూ.2500 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. దీంతో జైస్వాల్ కమిటీ సూచనల ప్రకారం డిస్టిలరీలకు బేసిక్ ధర పెంచి చెల్లిస్తారని అంతా భావించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అంగీకరించలేదు. సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయాలంటే ప్రభుత్వానికి అదనపు ఆదాయం అవసరమని, దానికోసం మాత్రమే ప్రత్యేక ఎక్సైజ్ సెస్‌ను అమల్లోకి తెచ్చామని ప్రభుత్వం తెగేసి చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీంతో డిస్టిలరీలు లిక్కర్ వ్యాపారం చేసే ఉత్తర తెలంగాణకు చెందిన ఓ ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వ పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. బేసిక్ ధరల మీద కనీసం 15శాతం వరకు అదనపు చెల్లింపులు చేయవచ్చన్న ధరల నిర్ణయ కమిటీ సూచన ఆధారంగా ధరలు పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నదట. అయితే.. ఇప్పటికే రెండుసార్లు ధరలు పెంచిన నేపథ్యంలో 10 శాతం మేరకు సవరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇదే జరిగితే బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ మీద రూ.10 నుంచి రూ.80 వరకు పెరుగుతుందని తెలుస్తున్నది. డిస్టిలరీలకు పోను ప్రభుత్వానికి ఏడాదికి దాదాపు రూ.3 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేసినట్టు సమాచారం. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం రేట్లు ఎక్కువగా ఉన్నాయని, ఇంకా ధరలు పెంచుతూ పోతే, ప్రజలు ఎన్డీపీఎల్, నకిలీ మద్యం వైపు మళ్లుతారని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించినట్టు తెలిసింది. అయినా పట్టించుకోకుండా మరోసారి మద్యం ధరలు పెంచేందుకే ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం ఫైల్ ముఖ్యమంత్రి వద్ద ఉన్నదని, త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు తెలిపాయి.

### పెంచిన ధరలతోనే కొత్త ఒప్పందం

మద్యం సరఫరా కోసం ప్రభుత్వం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30న ముగుస్తున్నది. జూలై ఒకటో తేదీ నుంచి కొత్త ఒప్పందం అమల్లోకి రావాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మద్యం కంపెనీల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించిన సీల్డ్ కవర్లను తాజాగా తెరిచారు. 92 మద్యం సరఫరా కంపెనీలు కలిసి మొత్తం 604 రకాల బ్రాండ్లను సరఫరా చేయడానికి ముందుకు వచ్చినట్టు ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి. ఇందులో 47 కొత్త కంపెనీలు (386 బ్రాండ్లు), 45 పాత కంపెనీలు (218 బ్రాండ్లు) ఉన్నట్టు వెల్లడించాయి. కొత్త వాటిలో కర్ణాటక, గోవా, మహారాష్ట్రకు చెందిన డిస్టిలరీలతోపాటు 20 వరకు హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థానిక కంపెనీలు ఉన్నట్టు సమాచారం.